క్లుప్తంగా

నేడు వైఎస్సార్ వర్ధంతి

తిరువూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాలు సోమవారం తిరువూరులో నిర్వహిస్తామని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ తెలిపారు. ఉదయం 8.30 గంటలకు నియోజకవర్గ పార్టీ ఇన్చార్జి నల్లగట్ల స్వామిదాసు ఇంటి వద్ద జరిగే కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

అన్నదానం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి రైల్వే స్టేషన్ ట్రాక్‌లపై వరద నీరు పొంగి పొర్లడంతో పలు రైళ్లకు అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో రైలు ప్రయాణికులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. స్థానిక శాంతినగర్‌లో వరద బాధితులకు ఆహారం అందించారు. లయన్ దేవినేని జోనీకుమారి, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్య శిబిరాలు

తిరువూరు: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రేష్మా బేగం ఆధ్వర్యంలో చింతల కాలనీ, భగత్‌సింగ్ నగర్ కాలనీ, పాత తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జెడ్పీ బాలికోన్నత పాఠశాల, సుందరయ్య కాలనీ, రాజుపేట ఎస్సీ కాలనీలలో వైద్య శిబిరాలు నిర్వహించారు. హెల్త్ విజిటర్ ఎస్‌కే ఆశాబీ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కరు పాల్గొన్నారు.

సీఐటీయూ సహాయక చర్యలు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఫెర్రీతో పాటు వివిధ గ్రామాల్లో ముంపు బాధితులను సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు సహాయక చర్యలు చేపట్టారు. ఆహారం, తాగునీరు అందించారు.

ముంచేసిన వరద



వరద పోటెత్తడంతో ఫెర్రీలో సామగ్రితో రోడ్డుపైకి చేరిన స్థానికులు



దొనబండ నుంచి చిలుకూరు, దాములూరు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వరద ప్రవాహం



కొండపల్లి ఇందిరమ్మ కాలనీ నుంచి వరద బాధితులను పడవలో తరలిస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది

ఇబ్రహీంపట్నం: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువ ప్రాంతాల నుంచి ప్రకాశం బ్యారేజీకి వస్తున్న సుమారు 10.25 లక్షల క్యూసెక్కుల వరదనీటి ప్రవాహంతో కృష్ణానది పరీవాహక గ్రామాలు వరద ముంపులో చిక్కుకున్నాయి. ఇబ్రహీంపట్నం ఫెర్రీ, పుష్కర నగర్, ఇసుకరేవు ప్రాంతాల్లో శనివారం అర్ధరాత్రి వరదనీరు చేరింది. ఇళ్లల్లో విలువైన సామగ్రి పడవల ద్వారా రోడ్డుపైకి చేర్చుకున్నారు. రాత్రంతా రోడ్లపై గడిపారు. పవిత్ర సంగమం వద్ద వరద ప్రవాహం పుష్కర ఘాట్ దాటి అర కిలో మీటర్ దూరం చేరింది. ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ సమీపంలోని చేపల మార్కెట్ వద్దకు వరద ప్రవాహం చేరింది. మూలపాడు, చిలుకూరు, కొటికలపూడి, జూపూడి, కిలేశపురం గ్రామాలను సైతం వరదనీరు తాకింది. దొనబండ నుంచి దాములూరు వెళ్లే రోడ్డుపై పరిటాల చెరువు నీరు చేరడంతో రాకపోకలు స్తంభించాయి.

పునరావాస కేంద్రాలకు తరలింపు

ఫెర్రీ పుష్కర నగర్, ఇసుకరేవు ప్రాంతాలకు చెందిన సుమారు 50 కుటుంబాలను ట్రక్ టెర్మినల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. చినలంక, పెదలంక గ్రామాల ప్రజలను తరలించేందుకు అధికారులు బోట్‌లను ఏర్పాటు చేశారు.

ఇందిరమ్మ కాలనీని ముంచెత్తిన బుడమేరు

కొండపల్లి ఇందిరమ్మ కాలనీ బుడమేరు వరదనీటి ముంపునకు గురైంది. అధికారులు ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బందిని రంగంలోకి దింపి పడవల ద్వారా స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బుడమేరు వరద ఉధృతికి ఆర్‌అండ్‌బీ రోడ్డు తెగిపోయింది. కొండపల్లి నుంచి కవులూరుకు రాకపోకలు నిలిచిపోయాయి.

పంటలకు తీవ్రనష్టం

ఇబ్రహీంపట్నం మండల పరిధిలో సుమారు 2,200 ఎకరాల్లో పంట నీటి ముంపునకు గురైనట్లు అధికారులు తెలిపారు. త్రిలోచనాపురం, జూపూడి గ్రామాల్లో వరదనీటికి గురైన పంటలను డివిజన్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. డివిజన్ పరిధిలో పత్తి, వరి, మొక్కజొన్న, మినుము పెసర పంటలు సుమారు 5,550 హెక్టార్లు వరద ముంపునకు గురైనట్లు ఆయన వెల్లడించారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

చాట్రాయి: మండలంలో తెల్లవారు జాము నుంచి ఉదయం 11 గంటల వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. చనుబండ సెంటర్‌లో వరద నీరు షాపుల్లోకి చేరింది. చనుబండ, మర్లపాలెంలో రెండు ఇళ్లు పడిపోయాయి. చాట్రాయి, గొల్లగూడెం, సోమవరం, కొత్తగూడెం గ్రామాల మధ్య ఉప్పు వాగు వరద ప్రవహిస్తోంది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలంలోని బేతుపల్లి పెద్ద చెరువు అలుగు ద్వారా 8 వేల క్యూసెక్కుల వరదను కిందకు వదలడంతో మండలంలోని చిన్నంపేట వద్ద వంతెనపై నుంచి ప్రవహిస్తూ తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టుకు భారీగా చేరుతోంది.

తిరువూరు మండలంలో 4,500 ఎకరాల పంట మునక

తిరువూరు: తిరువూరు మండలంలోని పలు గ్రామాల్లో ఖరీఫ్ వరి, ఇతర పంటలు నీట మునిగాయని మండల వ్యవసాయాధికారి పద్మ తెలిపారు. కట్టలేరు, పడమటివాగు పరివాహక గ్రామాల్లో 3,800 ఎకరాల్లో వరి, 600 ఎకరాల పత్తి, 50 ఎకరాల పెసర పంటలు నీటమునిగాయని ప్రాథమిక అంచనా వేశామని, వరద ఉధృతి తగ్గిన వెంటనే పూర్తిస్థాయిలో పంట నష్టం పరిశీలిస్తామని తెలిపారు.

వేలాది ఎకరాలు మునక..

విజయవాడరూరల్: బుడమేరు వరద ప్రభావంతో విజయవాడ రూరల్ మండలంలోని వెలగలేరు, కొత్తూరు, తాడేపల్లి, షాబాదు, జక్కంపూడి, పైడూరుపాడు, రాయనపాడు, గొల్లపూడి గ్రామాల్లో 4,600 ఎకరాల్లో వరి పంటలు పూర్తిగా మునిగాయి. కొత్తూరు తాడేపల్లి గ్రామంలో బుచ్చి రాజు చెరువు, ఎర్ర చెరువులకు గండ్లు పడి ఎస్టీ కాలనీని ముంచెత్తింది. పైడూరుపాడులో కొత్త ఎస్సీ కాలనీ ముంపులో ఉంది. రాయనపాడులో వైఎస్సార్ సీపీ నాయకుడు మల్లాది వెంకటేశ్వరరావు స్వచ్ఛందంగా భోజనాలు సిద్ధం చేసి బాధితులకు పంపిణీ చేశారు.

45 మంది వలస కార్మికుల తరలింపు

జి.కొండూరు: జి. కొండూరు మండలం కుంటముక్కల గ్రామ శివారులో నిర్వహిస్తున్న ఇటుక బట్టీలలో పనిచేస్తున్న 45 మంది వలస కార్మికులను జేసీబీల సాయంతో ఆదివారం ఉదయం సురక్షిత ప్రాంతానికి తరలించారు. వెలగలేరు గ్రామంలో వరద ప్రవాహంలో చిక్కుకున్న పలువురిని ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది రక్షించారు.

ఆగిరిపల్లి మండలంలో పంటలకు నష్టం

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి మండలంలో నీట మునిగిన పొలాలను మండల వ్యవసాయాధికారి పల్లగాని చెన్నారావు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 1,380 ఎకరాల పంట నష్టం జరిగిందని ప్రాథమిక అంచనా వేశామన్నారు.

ముంపు పొలాల పరిశీలన

నూజివీడు: భారీ వర్షానికి నియోజకవర్గ వ్యాప్తంగా ఆరు వేల ఎకరాల్లోని పంటలు ముంపునకు గురయ్యాయని వ్యవసాయ శాఖ నూజివీడు సహాయ సంచాలకులు జి.విద్యాసాగర్ తెలిపారు. మండలంలో ముంపునకు గురైన బత్తులవారిగూడెంలోని వరి పొలాలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు.

అప్రమత్తంగా ఉండాలి

నూజివీడు: వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. నూజివీడు పెద్ద చెరువుకు గండ్లు పడటంతో వరద ముంపునకు గురైన పట్టణంలోని 32వ వార్డులో ఆదివారం కలెక్టర్ పర్యటించి స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టర్‌తో పాటు ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి కలిసి 32వ వార్డులో ఇళ్లను పరిశీలించి, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. ఆర్డీవో వై.భవానీశంకరి తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు గండ్లు



గంపలగూడెం: భారీ వర్షాలకు గంపలగూడెం మండలంలోని పలు వాగులు, వంకలు, కట్టలేరు, నెమలి అనురాధవాగుల్లో వరద ఉధృతి ఆదివారం మరింత పెరిగింది. తోటమూల-వినగడప నడుమ కట్టలేరులో వరద ఉగ్రరూపం దాల్చింది. ఏరు ఉత్తరం దిక్కున కొత్తపల్లి క్రాస్ రోడ్డు వరకు, గంపలగూడెం వైపు ముత్యాలమ్మ గుడి వరకు వరద పోటెత్తింది. ఆయా వాగులు, వంకలు, అనురాధవాగు, కట్టలేరు పరీవాహక ప్రాంతంలో సాగుచేసిన వరి, పత్తిపొలాలు ముంపునకు గురయ్యాయి. పలు రహదారుల్లో రెండో రోజూ రాకపోకలు బంద్ అవడంతో ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులకు గురయ్యారు. ఊటుకూరు నల్ల చెరువుకు గండి పడింది. శనివారం పడిన వినగడప రాళ్లచెరువు, పెనుగొలను నల్లచెరువు గండ్లు మరింత పెద్దవై నీరు దిగువ పొలాల్లోకి ప్రవహించింది. కట్టలేరు ముంపుతో పెద్దకొమిర గ్రామంలోని 15 కుటుంబాల వారిని రెవెన్యూ శాఖాధికారులు తోటమూల సాంఘిక సంక్షేమ వసతిగృహంలోని పునరావాస కేంద్రానికి తరలించారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ఆయా వాగులు, కట్టలేరు వద్ద తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.

పల్లపు ప్రాంతాలు జలమయం

తిరువూరు: భారీవర్షాలతో తిరువూరు డివిజన్‌లో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. తిరువూరు మండలంలోని పడమటివాగు, కట్టలేరు, గుర్రపువాగు, విప్పలవాగు, వెదుళ్లవాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పలు రహదారుల్లో వాగులు పొంగుతుండటంతో సీఐ గిరిబాబు ఆధ్వర్యంలో ఎస్ఐలు సత్యనారాయణ, వెంకట్రావు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

100 కుటుంబాల తరలింపు

పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్ కాలనీ, సుందరయ్య కాలనీ, చింతలకాలనీలలో 100 కుటుంబాలను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోకి తరలించి సహాయక చర్యలు చేపట్టారు. తిరువూరు ఆర్డీఓ కె. మాధవి కాకర్ల వద్ద జాతీయ రహదారిపై వరద ఉధృతిని పరిశీలించి తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. తిరువూరు తహసీల్దారు ముంపు బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పంట పొలాలు మునిగిపోయాయి. తిరువూరు సమీపంలోని పోతుల చెరువు, మల్లమ్మ చెరువు కట్టలు తెగిపోయే ప్రమాదం నెలకొంది. తిరువూరు ఆర్టీసీ బస్టాండు, డిపోలలోకి వరదనీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఆర్టీసీ బస్సులను రోడ్లపై నిలిపి ప్రయాణికులను ఎక్కించుకున్నారు.

వరద మిగిల్చిన వ్యథ



జి.కొండూరు: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు మండల పరిధిలోని వాగులు ఉగ్రరూపం దాల్చాయి. లోతట్టు కాలనీలు, వ్యవసాయ భూములు, రహదారులు జలమయమయ్యాయి. చెర్వుమాధవరం గ్రామంలో వాగు పక్కన ఉన్న ఇళ్లు ధ్వంసమయ్యాయి. గడ్డమణుగు శివారులోని మోట్రగడ్డ దగ్గర వంతెన కూలిపోయింది. జి.కొండూరు, గడ్డమణుగు, చెర్వుమాధవరం, సున్నంపాడు, మునగపాడు, గంగినేని, తెల్లదేవరపాడు గ్రామాల పరిధిలో ప్రధాన రహదారి పలు చోట్ల ధ్వంసమైంది. జి.కొండూరు నుంచి ఆత్కూరు వెళ్లే రహదారి సైతం పలు చోట్ల కోతకు గురైంది. వెంకటాపురం వాగు ఉధృతి కూడా తగ్గుముఖం పట్టడంతో కుంటముక్కల విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పులివాగు వరద ప్రభావానికి పలు గ్రామాలలో సాగు చేస్తున్న వరి, పత్తి, బొప్పాయి, కూరగాయ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి.

ప్రభుత్వ కార్యాలయాల్లోకి నీరు..

పులివాగు వరద ప్రభావానికి జి.కొండూరులో వాగు పక్కన ఉన్న మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, విద్యా వనరుల కార్యాలయం, బీసీ బాలికల వసతిగృహం, ఎస్సీ బాలుర వసతిగృహం, కేడీసీసీబీ, జెడ్పీ హైస్కూల్, హౌసింగ్ కార్యాలయం, గ్రామ సచివాలయం-2 భవనాలలో ఐదు అడుగుల మేర నీరు చేరింది. ఈ కార్యాలయాలలో కంప్యూటర్లు, రికార్డులు పూర్తిగా నీట మునిగాయని అధికారులు చెబుతున్నారు.